పరిశుభ్రతతోనే డయేరియా నివారణ



కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అవగాహన కల్పిస్తున్న వైద్యులు



ఉండిలో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



వీరవాసరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

పీహెచ్‌సీల పరిధిలో స్టాప్ డయేరియాపై అవగాహనా ర్యాలీలు

కాళ్ల: జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా వ్యాధిపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని కాళ్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు సరాబు సునీల్ చెప్పారు. కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద స్టాప్ డయేరియాపై సోమవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువసార్లు నీళ్ల విరోచనాలు, వాంతులు అయితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఇంటిలోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఎవరికైనా వ్యాధి లక్షణాలు కలిగి ఉన్నట్లయితే వెంటనే ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్యాధికారులను సంప్రదించి వైద్యం పొందాలని స్పష్టం చేశారు. డయేరియా వ్యాధి బారిన పడినవారు ఓఆర్ఎస్ తీసుకుని, జింక్ టాబ్లెట్లను వేసుకోవాలని సూచించారు. అవసరమైన మందులు ప్రతి గ్రామంలోనూ వైద్య సిబ్బంది వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అతిసార నుంచి పిల్లలను రక్షించండి

పాలకోడేరు: అతిసార వ్యాధి నుంచి పిల్లలను రక్షించడం కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారి చినమిల్లి రంగమనాయుడు ఆధ్వర్యంలో పాలకోడేరులో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు, పెద్దలకు వాంతులు విరోచనాలు అయితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రతి గ్రామంలో సంబంధిత ఆరోగ్య సిబ్బంది వద్ద అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని, క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలని, ఇంటి పరిసర ప్రాంతాలలో వర్షం, మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని, పరిసరాలను శుభ్రం చేసుకుని దోమలు పెరగకుండా అరికట్టుకోవాలన్నారు. కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా, కలరా, పచ్చకామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధులు సంక్రమిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్‌ఓ సత్యనారాయణ, పీహెచ్ఎన్, హెల్త్ సూపర్‌వైజర్లు, హెచ్‌వీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

వీరవాసరం: కొణితివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో స్టాప్ డయేరియా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు నవనీత్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలు, సామాజిక పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన మంచి నీటిని తాగాలన్నారు. వేడి ఆహార పదార్థాలను తినాలని, వండిన ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలని సూచించారు. కొణితివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పి.ప్రభాకర్ రావు, కే రవికుమార్, కార్మూరి కుమార్, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండండి

ఉండి: ప్రజలంతా అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ సాయిచంద్ర అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉండి పీహెచ్‌సీ నుంచి తహసీల్దార్ కార్యాలయాల మీదుగా వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అధికారులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిచంద్ర మాట్లాడుతూ అతిసార వ్యాధి కలుషిత ఆహారం వల్లనే సోకుతుందన్నారు. నిల్వ ఉన్న ఆహారం తీసుకున్నా వ్యాధి బారినపడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎం.రామకృష్ణారెడ్డి, పీహెచ్‌ఎన్, హెచ్‌వీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యర్థాల నిర్వహణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్యామల

భీమవరం(ప్రకాశం చౌక్): శాస్త్రీయ పద్ధతిలో ఘన వ్యర్థాల నిర్వహణ, మురికి వ్యర్థాల నిర్వహణ పద్ధతులపై మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎం.శ్యామల సిబ్బందికి అవగాహన కల్పించారు. రానున్న ఆరు నెలల కాలంలో పురపాలక సంఘ పరిధిలోని నూరుశాతం వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌కు చేరకుండా సమీప ప్రాంతాలలోనే శాస్త్రీయ పద్ధతులలో కంపోస్టింగ్ చేసే విధానాలపై చర్చించారు. ముందుగా డంపింగ్ యార్డ్‌కు చేరుకుని అక్కడ జరుగుతున్న డంపింగ్ విధానాలను పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాలను అక్కడే ప్రాసెస్ చేయడానికి అనువైన పద్ధతులను పరిశీలించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, శానిటేషన్ సెక్రటరీలు, ఏమినిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

విద్యా కిట్ల పంపిణీ



విద్యా కిట్లు పంపిణీ చేసిన దృశ్యం

పెనుగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థినులు మహిళా శక్తిగా ఎదగాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ అన్నారు. సోమవారం పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరికీ విద్య నందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేరు క్వీనీ, రొక్కాల సురేష్ బాబు, బాలం కనకదుర్గ, వి.మంగ, గూడూరి దుర్గాభవానీ, వేంద్ర రాము, కటికిరెడ్డి నానాజీ, ఎంఈవో శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



దంత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెనుగొండ: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భీమవరం విష్ణు దంత వైద్యశాల సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం ఎస్ఆర్‌కే విల్లాలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.రామచంద్రరాజు, డాక్టర్ మేడపాటి మురళీ జోగిరెడ్డి, డాక్టర్ మేడపాటి షాలినీ రెడ్డి, డాక్టర్ కేఎస్ చైతన్య రామ్, డాక్టర్ కొమ్మిరెడ్డి ప్రియాంకలు, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు, కార్యదర్శి షేక్ మస్తాన్, కోశాధికారి యల్లమర్తి నరసింహారావు, రీజియన్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు, కర్రి నరేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

అతిసార వ్యాధి నివారణ పోస్టర్ ఆవిష్కరణ



అతిసార వ్యాధి నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్

పాలకొల్లు అర్బన్: అతిసార వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ అన్నారు. మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అతిసార వ్యాధి నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 30 వరకు అతిసార నివారణ వ్యాధిపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ తిరిగి 5 ఏళ్ల లోపు చిన్నారులను సర్వే చేసి వారికి జింకు మాత్రలు అందజేయాలన్నారు. అలాగే చేతుల పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. కలుషితమైన నీరు తాగడం, ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినడం వంటి వాటి వలన అతిసార వ్యాధి ప్రబలుతుందన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, ఆహార పదార్థాలపై మూతలు పెట్టుకొని, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా ప్రజలకు సరఫరా చేసే మంచి నీరు క్లోరినేషన్ చేసి, అవసరమైన చోట తక్షణం వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, డి.కమల, ఎస్‌కే అమలేశ్వరరావు, పీవీ స్వామి, జి.ఉదయచంద్ర, కె.సత్తిబాబు, కె.ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా మెరుగుకు చర్యలు



చినకాపవరంలో మోటార్‌ను బిగిస్తున్న సిబ్బంది

ఆకివీడు: చినకాపవరంలో మంచినీటి సరఫరా వ్యవస్థను మరింత అభివృద్ధి చేసేందుకు గ్రామ పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పంప్ హౌస్ వద్ద నుంచి కుళాయిల ద్వారా మంచినీటిని సరఫరా చేసేందుకు కొత్త విద్యుత్ మోటార్‌ను యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేసింది. సోమవారం పంప్‌హౌస్ వద్ద మోటారు ఏర్పాటు పనుల్ని సర్పంచ్ నాతిరెడ్డి విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.70 వేల వ్యయంతో విద్యుత్ మోటార్‌ను కొనుగోలు చేశామన్నారు. మంచినీటి చెరువు నుంచి పంప్‌హౌస్ వరకు పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. సుమారు 60 అడుగుల పైప్‌లైన్‌ను నిర్మించి, చెరువు నుంచి నేరుగా ఫిల్టర్ బెడ్‌లలోకి నీటిని నింపి, ఫిల్టర్ చేసి, రక్షిత మంచినీటి ట్యాంక్ ద్వారా కుళాయిలకు సరఫరా చేస్తామని చెప్పారు. ఆయా పనుల్ని గ్రామ కార్యదర్శి ఆనంద భూషణం పర్యవేక్షించారు.

6న మండల పరిషత్ సమావేశం

పాలకోడేరు: పాలకోడేరులో ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టి.అనూహ్య సోమవారం చెప్పారు. ఎంపీపీ అధ్యక్షుడు భూపతిరాజు చంటిరాజు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

సమాజంలో వైద్యుల పాత్ర కీలకం

ఉండి: సమాజంలో వైద్యుల పాత్ర చాలా కీలకమైందని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం జాతీయ డాక్టర్స్ డే పురస్కరించుకుని ఉండి లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో వైద్యులు గైనకాజిస్టు డాక్టర్ ముదుండి సుబ్బలక్ష్మి, చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ కాగిత శ్రీనుబాబులను క్లబ్ తరపున సత్కరించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు మాట్లాడుతూ కరోనా సమయంలో ఎంతో మంది వైద్యులు ప్రాణాలు లెక్క చేయకుండా వైద్యసేవలందించి కోట్ల మంది రోగులను బతికించారన్నారు. వైద్యులు లేకపోతే మనుషి జీవితం ఎలా ఉండేదో ఊహించేందుకే కష్టంగా ఉందన్నారు. భారతరత్న డాక్టర్ బీ చంద్రరాయ్ వైద్య సేవలు నేటి యువ డాక్టర్లకు ఆదర్శప్రాయమని అన్నారు. డాక్టర్లు సుబ్బలక్ష్మి, శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవుడిచ్చిన జీవితాన్ని నిర్లక్ష్యంగా గడిపి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని అన్నారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన, శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. తమ సేవలను గుర్తించి ఉండి లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. క్లబ్ ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు, రుద్రరాజు నరసరాజు, ట్రెజరర్ పాలతీర్థపు నర్సింగరావు, కూనపరాజు రామరాజు, భూపతిరాజు హరనాథరాజు, కన్నెగంటి రూత్‌కళ, గాదిరాజు వెంకటేశ్వరరాజు, ముదునూరి విజయ, కాగిత మహంకాళి, బొండాడ కేశవరావు పాల్గొన్నారు.



ఆకివీడు సీహెచ్‌సీలో వైద్యుల్ని సత్కరిస్తున్న లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు

పునర్జన్మనిచ్చే వైద్యులూ దేవుళ్లే

ఆకివీడు: భగవంతుడు ప్రాణం పోస్తే, వైద్యులు పునర్జన్మనిస్తున్నారని లయన్స్ రీజనల్ చైర్మన్ గొంట్లా కృష్ణమూర్తి అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో సోమవారం డాక్టర్ డే కార్యక్రమం లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారు వైద్యుల వల్లే ప్రాణాల్ని నిలబెట్టుకుంటున్నారని అన్నారు. కోవిడ్ లాంటి మహమ్మారి వ్యాప్తి చెందినప్పుడు ప్రాణాలకు తెగించి వైద్యం అందజేసి, ఎంతో మంది ప్రాణాల్ని కాపాడారన్నారు. సీహెచ్‌సీ వైద్యులు ఎండీ అజ్మీనా నజ్రీన్, చైతన్య, రాజేష్, భువన, వర్మలను సత్కరించారు. ఆకివీడు లయన్స్, ఆదర్శ, అభయ, ఆక్వా గోల్డెన్ లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. పెదకాపవరం గ్రామంలోని ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్స్ డే జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు ఎం.రమేష్, బీ రాజశేఖర్‌లను సిబ్బంది ఘనంగా సత్కరించారు.



పెదకాపవరం పీహెచ్‌సీలో వైద్యుల్ని సత్కరిస్తున్న దృశ్యం



ఉండిలో వైద్యులను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు.

ఆలయ భూమి కౌలు వేలం ద్వారా రూ.16.69 లక్షల ఆదాయం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం గునుపూడిలో వేంచేసి యున్న పంచారామక్షేత్రం శ్రీసోమేశ్వర జనార్దనస్వామి వారి దేవస్థానానికి చెందిన 52.79 ఎకరాల వ్యవసాయ భూమి మూడేళ్ల కౌలు హక్కులకు సోమవారం ఆలయంలో టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించారు. దీనిలో అత్యధికంగా రూ.16,69,000 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ డి.కృష్ణంరాజు చెప్పారు. టెండర్ కమ్ బహిరంగ వేలం పాటను పీటీ గోవిందరావు పర్యవేక్షించారు.

బకాయిల వసూళ్లలో కాళ్లకూరు సొసైటీ ముందంజ

కాళ్ల: కాళ్లకూరు సొసైటీ పరిధిలో 2023-24 సంవత్సరానికి సంబంధించి రైతుల నుంచి రావాల్సిన బకాయిలను నూటికి నూరుశాతం వసూలు చేసినట్లు కాళ్లకూరు సొసైటీ ఇన్‌చార్జి వర్షిని, సొసైటీ సీఈఓ ఇబ్బ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో సంఘ సభ్యుల నుంచి రావాల్సిన మొత్తం సుమారు రూ.18,80,58,000 వసూలు చేసినట్లు తెలిపారు. గత 28 ఏళ్లుగా జిల్లాలో సహకార సంఘాల పరిధిలో బకాయిలు నూరు శాతం రికవరీ చేసి ఆదర్శ సంఘంగా నిలిచిందన్నారు. దీనికి సహకరించిన జిల్లా సహకార సంఘ సిబ్బందికి, రైతులకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వర్లు మొరాయించి.. నత్తనడకగా సాగి



ఆకివీడులో పింఛను అందజేస్తున్న హైమావతి

ఆకివీడు: మండలంలో సోమవారం పింఛన్ల పంపిణీ తొలుత నత్తనడకగా సాగింది. ఉదయం 6 గంటలకు ప్రారంభించినా చాలా గ్రామాల్లో వేలిముద్రలు పడక, సర్వర్లు పనిచేయక, నెట్ సమస్యలతో సచివాలయ సిబ్బంది సతమతమయ్యారు. ఎనిమిది గంటల నుంచి సర్వర్లు కొన్ని చోట్ల పనిచేయగా, కొంతమందికి పింఛను అందజేశారు. మధ్యాహ్నం నుంచి అన్ని గ్రామాల్లో, వార్డు సచివాలయాల పరిధిలో సర్వర్లు పూర్తి స్థాయిలో పని చేయడంతో పింఛన్ల పంపిణీ వేగం పుంజుకుంది. అయితే కొన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది రాత్రి 8 గంటల వరకు లబ్ధిదారుల కోసం పడిగాపులు పడ్డారు. పనులకు వెళ్లి, ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగి ఇళ్లకు చేరుకున్న వారికి పింఛన్లు అందజేశారు. సచివాలయ సిబ్బందితోపాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో నియోజకవర్గంలోని ఆకివీడు మండలంలో 93.31 శాతం, ఉండి మండలంలో 95 శాతం, కాళ్ల మండలంలో 95.34 శాతం, పాలకోడేరు మండలంలో 91.84 శాతం మేర పింఛన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 32,727 మంది వివిధ రకాల పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారు.

నియోజకవర్గంలో పింఛన్ల లబ్ధిదారుల వివరాలు

మండలం	లబ్ధిదారుల సంఖ్య
ఆకివీడు	5,468
ఉండి	8,944
కాళ్ల	8,975
పాలకోడేరు	9,290
మొత్తం	32,727

పింఛన్ల పంపిణీ పరిశీలించిన జేసీ

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం ఎస్సీ కాలనీలో జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులందరికీ పింఛన్ అందించేలా అధికారులు కృషి చేయాలన్నారు. కోలమూరులో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరిచెర్ల సుభాష్‌రాజు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో ఎస్.రవీంద్ర, కార్యదర్శి జేవీటీ నాయుడు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎన్నార్పీ అగ్రహారంలో పింఛన్ ఇస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

పెన్షన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే పులపర్తి

వీరవాసరం: వీరవాసరం, బాలేపల్లి, మెంటేపూడి గ్రామాల్లో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. సచివాలయ సిబ్బంది, ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, జెడ్పీటీసీ సభ్యులు గుండా జయప్రకాష్ నాయుడు, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, తోట విజయ్‌కుమార్, ఎరకరాజు చినబాబు, మోపిదేవి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: మండలంలోని తుండుర్రు, తాడేరు, బేతపూడి గ్రామాల్లో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.4 వేలు పెంచిన సొమ్ముతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు వెయ్యి చొప్పున రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు పెన్షన్‌దారులకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో హామీ మేరకే పింఛన్ల పంపిణీ

పాలకోడేరు: ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా పెంచిన పింఛన్లను సోమవారం సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు అందజేసినట్లు ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు చెప్పారు. సోమవారం వేంద్ర సచివాలయం వద్ద పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా పెంచిన పింఛను సొమ్ము అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లబ్ధిదారులంతా కృతజ్ఞతలు తెలియజేయాలన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రూ.3 వేలు, జూలైకి సంబంధించి పింఛను సొమ్ము రూ.4వేలు కలిపి మొత్తం రూ.7 వేలు లబ్ధిదారులకు అందజేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, ఠాగూర్ కోటేశ్వరరాజు, చలపతి, ఎంపీడీవో టి.అనూహ్య, తహసీల్దార్ కే నాగార్జున పాల్గొన్నారు.



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

భీమవరం (ప్రకాశం చౌక్): ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సోమవారం భీమవరంలో కలెక్టర్ సి.నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాను కప్పి, పుష్పగుచ్ఛాన్ని, పూలమొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు విషయాలపై ఎమ్మెల్యేలు కలెక్టర్‌తో చర్చించారు.

అల్లూరి జయంత్యుత్సవాలు ప్రారంభం

భీమవరం (ప్రకాశం చౌక్): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు దేశస్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం అజరామమని, ధైర్యానికి సాహసానికి ప్రతీక అల్లూరి అని అల్లూరి సీతారామరాజు సేవా సమితి కార్యదర్శి చెరుకువాడ సుబ్రహ్మణ్యరాజు అన్నారు. పట్టణంలోని అల్లూరి కాంస్య విగ్రహం వద్ద అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంత్యుత్సవాలను ప్రారంభించారు. యువజన సంఘం సమాఖ్య అధ్యక్షుడు కాంతేటి వెంకటరాజు మాట్లాడుతూ అల్లూరి ఒక కారణజన్ముడని, అల్లూరి వీర పోరాటం దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఒక రోజు కాకుండా వారోత్సవాలుగా నిర్వహించడం ద్వారా విద్యార్థులకు అవగాహన కలుగుతుందన్నారు. నాలుగు రోజులపాటు పలు పాఠశాలలో ర్యాలీలు, అవగాహన సదస్సులు, పోటీలు నిర్వహిస్తామని, 4న జయంతి వేడుకల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ముందుగా జేఎల్‌బీ హైస్కూల్ నుంచి అల్లూరి విగ్రహం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం బి.శ్రీనివాస్, స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



అల్లూరి జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

పోస్టాఫీస్ సేవలు వినియోగించుకోండి

నరసాపురం రూరల్: పోస్టాఫీస్ బ్రాంచ్ కార్యాలయం అందించే సేవలను ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని భీమవరం సీనియర్ సూపరింటెండెంట్ ఎన్వీ సత్యనారాయణరాజు కోరారు. నరసాపురం మండలం యర్రంశెట్టి వారిపాలెంలో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన బ్రాంచ్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం మాదిరిగా పోస్టాఫీస్ అంటే కేవలం ఉత్తరాలు బట్వాడా చేయడం కాదని, జాతీయ బ్యాంకులు అందిస్తున్న సేవలన్నీ అందిస్తున్నాయన్నారు. మీ గ్రామంలో పోస్టాఫీస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి మీ గ్రామ పెద్ద యర్రంశెట్టి బాబులు కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సురేష్ కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి, ఎర్రంశెట్టి బాబులు, కుక్కల మీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



బ్రాంచ్ పోస్టాఫీస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ సత్యనారాయణరాజు